కాలుష్యం పడగ!

దుమ్ము, ధూళితో నిండిపోతున్న రోడ్లు • రోగాలబారిన పడుతున్న నివాసులు



పోర్టు రోడ్‌లో కాలుష్యం



లారీలోనుంచి రోడ్డుపై జారి పడుతున్న బొగ్గు

గాజువాక: ఒకపక్క గతుకుల రోడ్లు.. మరోపక్క కమ్మేస్తున్న దుమ్ము, ధూళి.. నిబంధనలను పాటించని భారీ వాహనాలతో గాజువాకలో కాలుష్యం ముప్పు భారీగా పెరిగింది. ఏ ప్రాంతంలో చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పారిశ్రామిక కాలుష్యంతో ఒక పక్క బాధ పడుతున్న గాజువాక ప్రాంత వాసులను వాయు కాలుష్యం మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది.

ఇదీ పరిస్థితి

పోర్టు రోడ్ వై జంక్షన్ నుంచి జగ్గు జంక్షన్, వందడుగుల రోడ్ మీదుగా జాతీయ రహదారి వరకు దుమ్ము, ధూళితో నిండిన కాలుష్యం సుమారు పది కాలనీ వాసులను కమ్మేస్తోంది. పారిశ్రామిక మెటీరియల్స్‌తో ఈ రోడ్‌లో రాకపోకలు సాగిస్తున్న లారీలు, టిప్పర్ల వంటి భారీ వాహనాలు నిబంధనలు పాటించక పోవడంతో బొగ్గు వంటివి రోడ్డుపై పడుతున్నాయి. టార్పాలిన్లు కప్పకపోవడంతో రేణువులు ఎగిరి రోడ్డుపై పడుతున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రయాణానికి ఊపిరాడడం లేదని పేర్కొంటున్నారు. పోర్టు, స్టీల్‌ప్లాంట్ నుంచి ప్రతిరోజు వందలాది లారీలు, టిప్పర్లు స్వతంత్రనగర్, దుర్గానగర్, వై.జంక్షన్, పాత కర్ణవానిపాలెం, అఫీషియల్ కాలనీ, జగ్గు జంక్షన్, వందడుగుల రోడ్ మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటాయి. బొగ్గు, జిప్సం, ఇనుప ఖనిజం, గంధకం పొడి వంటి రసాయన పదార్థాలను రవాణా చేస్తుంటాయి. పోర్టు రోడ్ మొదలుకొని ఇటు జాతీయ రహదారిపై కూడా లారీల్లోని మెటీరియల్ రోడ్ల మీదే పడిపోతోంది. లారీలు, టిప్పర్లతో పెద్ద మొత్తంలో సరుకు వెళ్తున్నా కనీస ప్రమాణాలు పాటించడం లేదు. రోడ్లపైనే మెటీరియల్ పడిపోవడం, వాటి వెనుక వెళ్తున్న వాహనాలు ఆ మెటీరియల్‌పై నుంచి వెళ్తుండటంతో దుమ్ముగా మారి వాహన చోదకుల కళ్లలోకి పడిపోతోంది. కాలుష్యం పొగ మాదిరిగా కమ్మేస్తోంది.

కమ్మేస్తున్న దుమ్ము, ధూళి

వై.జంక్షన్, జగ్గు జంక్షన్ మీదుగా జాతీయ రహదారివైపు రాకపోకలు సాగిస్తున్న లారీల కారణంగా కాలుష్యం అధికమవుతోంది. దుమ్ము, ధూళి ఎగిరిపడి ఇళ్లల్లోకి చేరుతోందని ఈ రోడ్‌ను ఆనుకొని ఉన్న నివాసులు గగ్గోలు పెడుతున్నారు. తలుపులు మూసుకున్నా ఇళ్లల్లోకి దుమ్ము ఆగడం లేదని చెబుతున్నారు. కాగా, లారీల వెనుక వెళ్లే ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకొంటుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పక్కన చేరిన బూడిద

అనారోగ్యాలతో అవస్థలు

కాలుష్యం కారణంగా అనారోగ్యాలకు గురవుతున్నామని నివాసులు పేర్కొంటున్నారు. కళ్ల మంటలు, ముక్కు దిబ్బడ, జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి, శ్వాస సరిగ్గా ఆడకపోవడం, గుండెదడ, కండరాల నొప్పులు, శ్వాసకోశ వ్యాధులు, క్షయ, ఉబ్బసం, ఎలర్జీ, చర్మ వ్యాధులు చోటు చేసుకొంటున్నాయని చెబుతున్నారు, ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు కాలుష్యం బారిన పడి తీవ్ర అనారోగ్యాలకు లోనవుతున్నారని పేర్కొంటున్నారు.

రోగాల బారిన పడుతున్నాం



దుమ్ము, ధూళి మా ఇళ్ల పైకి వస్తోంది. పోర్టు రోడ్‌ను ఆనుకొని ఉన్న సుమారు పది కాలనీల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చిన్నపిల్లలు సైతం అనేక వ్యాధులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కడంలేదు. -కరణంరెడ్డి నరేష్, గాజువాక

ఎవరూ పట్టించుకోవడంలేదు



పోర్టు రోడ్‌లో పారిశ్రామిక మెటీరియల్‌ను తీసుకువెళ్తున్న భారీ లారీల కారణంగా చాలా కాలుష్యం వస్తోంది. ఈ విషయాన్ని ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులందరికీ వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నాం. ప్రభుత్వాలు మారుతున్నా మా సమస్య మాత్రం అలాగే ఉంది. - ఇందల వెంకటేష్, పాతకర్ణవానిపాలెం



కాలుష్య సమస్యపై ఎమ్మెల్యే పల్లాకు వినతి పత్రం అందజేస్తున్న బాధిత ప్రాంతాల నివాసులు (ఫైల్)

క్లుప్తంగా

ప్రభుత్వ న్యూ ఐటీఐలో జాబ్ మేళా రేపు

పెదగంట్యాడ: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ న్యూ ఐటీఐలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహించనున్నామని ప్రభుత్వ న్యూ ఐటీఐ ప్రిన్సిపల్ కేఎస్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, పెయింటర్, మెషినిస్ట్ పూర్తి చేసిన వారితో పాటు ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌లో 100 మందికి అప్రెంటిషిప్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అలాగే నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టులో క్లర్క్, ఇన్‌చార్జి, ఐటీ–హార్డ్‌వేర్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని తెలిపారు. మోల్‌బియో డయాగ్నస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 వరకూ ఖాళీలు ఉన్నాయని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 24న ఉదయం 9.30 గంటల నుంచి ప్రభుత్వ న్యూ ఐటీఐలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8121743777 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి



స్టేడియం ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే పల్లా తదితరులు

పెదగంట్యాడ: అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని విశాఖ ఎంపీ శ్రీ భరత్ అన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆదర్శగ్రౌండ్‌లో అత్యాధునిక సదుపాయాలతో స్టేడియం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. వుడా కాలనీలోని కళా ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. వుడా డబుల్ రోడ్డును నిర్మించడంతో పాటు డివైడర్ మధ్యలో వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ కొండపై ఉన్న వుడా స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఉద్యాన వనాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని జోనల్ కమిషనర్ డి.శేషాద్రిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ ఎంఆర్‌ఎస్ అప్పారావు, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, బలగా బాలునాయుడు, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!



కొండయ్యవలస బంగారమ్మ గుడి దగ్గర ప్రమాదకంగా ఇనుప చువ్వలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు మినీ జగదాంబ జంక్షన్ నుంచి బంగారమ్మ గుడికి వెళ్లే మార్గ మధ్యలో కర్రివానిపాలెం ఉమామహేశ్వరస్వామి ఆలయం సమీపంలో జీవీఎంసీ పైప్‌లైన్ వాల్వ్‌లు ఏర్పాటు చేసిన చోట సిమెంట్ దిమ్మెలు అమర్చారు. ఆ సిమెంట్ స్తంభాలకు ఉన్న కాంక్రీట్ ఊడిపోవడంతో ఇనుప చువ్వలు పైకి తేలిపోయాయి. రాత్రి వేళల్లో అయితే అవి కనపడడం లేదు. దీంతో వీటి మీద నుంచి వాహనాలు మళ్లిస్తే వాహనం టైర్ పంక్చర్ అవడంతో పాటు చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఆ పలకలు తొలగించి కొత్తవి అమర్చాలని కోరుతున్నారు.

డీపీటీవోకు అభినందనలు

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బి.అప్పలనాయుడును విశాఖ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ జై భీమ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా సెక్రటరీ యల్లపు రాంబాబు, పలువురు సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.

అమ్మో.. మంగళవారం సంత

స్తంభిస్తున్న ట్రాఫిక్



రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు



సంత కారణంగా ఇరుక్కు పోయిన బస్సులు

అక్కిరెడ్డిపాలెం: ఆ సంత అంటే వాహనదారులకు హడలే. షీలానగర్, గవరజగ్గయ్యపాలెంలో మంగళవారం సంత నిర్వహిస్తుంటారు. ఇరుకు రోడ్డు పక్కనే కూరగాయాలు, చాపలు, నిత్యావసర వస్తువులు విక్రయిస్తారు. నరవ, గోపాలపట్నం, పెందుర్తి, ముషిడివాడ, వెదుళ్లనరవ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు సంతలో పాల్గొంటారు. హరిజనజగ్గయ్యపాలెం, షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, గవరజగ్గయ్యపాలెం వాసులకు సంత ఎంతో వెసులు బాటుగా ఉంటుంది. కానీ ఇరుకు రోడ్డులో ఇరువైపులా వ్యాపారాలు చేయడంతో నరవ ప్రాంతంలో ఉన్న వికాస్, బెహరా, విశాఖ వంటి ఇంజినీరింగ్, డిప్లమో కళాశాలల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యా సంస్థల బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. దీంతో నరవ, గోపాలపట్నం పరిసర ప్రాంతాలకు వెళ్లే వారు గంటల తరబడి ట్రాఫిక్ వలయంలో చిక్కుకు పోతున్నారు. సంత రోజు వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ నాయకులతో ఆర్‌ఎల్‌సీ సమావేశం



నాయకులతో చర్చిస్తున్న ఆర్‌ఎల్‌సీ మొహంతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎన్‌డీఏ కూటమి కార్మిక సంఘాలు (బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, డీఎస్‌ఈయూ, వీఎస్‌పీఈయూ, యూఎస్‌ఈయూ) నాయకులు, ఉక్కు యాజమాన్యం ప్రతినిధులతో మంగళవారం కేంద్ర కార్మిక శాఖ రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సి) కె.జె. మొహంతి సమావేశమయ్యారు. ఈనెల 28న తలపెట్టిన కార్మిక సమ్మెను విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు తమ డిమాండ్లను వివరించారు. ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఉక్కునగరం క్వార్టర్ల విద్యుత్ చార్జీలు తగ్గించాలని, హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరించాలని కోరారు. దీనిపై యాజమాన్యం ప్రతినిధులు మాట్లాడుతూ ఉత్పత్తి పెరిగిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ చార్జీల అంశంపై కోర్టులో ఉన్నందున తాము నిర్ణయం తీసుకోలేమన్నారు. హెచ్‌ఆర్‌ఏ ఏరియర్స్‌తో సహా చెల్లిస్తామన్నారు. యాజమాన్యం అభ్యర్థన మేరకు సమ్మెను విరమిస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో కూటమి నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, కాంద్రేగుల శ్రీనివాసనాయుడు, నమ్మి సింహాద్రి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ పందులు

- వార్డుల్లో స్వైర విహారం
- పిల్లలు, పెద్దలపై దాడులు



73వ వార్డు వుడా కాలనీ ప్రధాన రహదారి పై పందులు



76వ వార్డులోని నడుపూరులో పందుల గుంపు

పెదగంట్యాడ: మండలంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి.. రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. అటుగా రాకపోకలు సాగించే వారిపై దాడులకు దిగుతున్నాయి. వాహనచోదకులకు అడ్డంగా రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల పరిధిలో చిననడుపూరు,వుడా కాలనీ, పెదనడుపూరు, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, రామచంద్రనగర్, గాంధీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, స్వతంత్రనగర్, కోరాడ, బాలచెరువు, బానోజీ కాలనీ, తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఎక్కడ చెత్తా చెదారం కనిపిస్తే అక్కడ తిష్టవేస్తున్నాయి, ఆ చెత్తా చెదారాన్ని చిందరవందర చేయడంతో పాటు వాటిల్లో అవి దెబ్బలాడుకుంటూ అటుగా వెళ్లే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. నిత్యం ఈ ప్రాంతంలోని స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయంలో పందులు అక్కడే సంచరిస్తూ వాహనాలకు అడ్డుపడుతున్నాయి. దీంతో వారు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. జన సమమర్దం ఉన్న ప్రాంతాల్లో కూడా పరుగులు తీస్తూ జనాన్ని సైతం భయాందోళనకు గురి చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ వచ్చేపోయే వారిపై దాడులకు దిగుతున్నాయి. పిల్లలు అటుగా వెళ్తే చాలు.. వారి చేతిలో ఏమైనా వస్తువులు ఉంటే చాలు వెంబడిస్తున్నాయి. పందుల బెడద తీవ్రమవుతున్నా అరికట్టేందుకు అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదో ఒక సంఘటన జరిగితే గానీ వారిలో చలనం రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు తూతూమంత్రంగా చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారని అంటున్నారు.



75వ వార్డు సీతానగరంలో...

ఉక్కు ఉద్యమనేతకు ఇచ్చే గౌరవం ఇదేనా!

యాజమాన్యం తీరు దారుణం

అగనంపూడి: విశాఖ ఉక్కు ఉద్యమానికి ఊపిరిపోసిన ఉద్యమనేత అమృతరావు జయంతి వేడుకలను యాజమాన్యం తూతూ మంత్రంగా చేసి ఆయన్ను అగౌరవ పర్చిందని వీఎస్‌ఈయూ నాయకుడు పట్టా రామఅప్పారావు ఆరోపించారు అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమృతరావు 104వ జయంతిని యాజమాన్యం కంటి తుడుపుగా చేపట్టిందన్నారు. ప్రతీ ఏటా దివంగత అమృతరావు జయంతిని ఘనంగా నిర్వహించిన ఉక్కు యాజమాన్యం ఈ జయంతికి కనీసం ఏర్పాట్లు చేయకుండా ఆయన విగ్రహానికి దండవేసి మమా.. అనిపించి అవమానపర్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమృతరావు కుటుంబ సభ్యులు గుంటూరు నుంచి వస్తే కనీసం వారికి ఒక పూట భోజనం కూడా పెట్టకుండా నిర్లక్ష్య ధోరణితో అవమానకరంగా పంపేయడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో బి.శ్రీనివాసరావు, కె.అప్పారావు, కె.పైడిరాజు, ఎస్.రామారావు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కాంట్రాక్ట్ కార్మికులు



ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు కదం తొక్కారు. పలు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నేతృత్వంలో కార్మికులు మంగళవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ వైద్య పరీక్షల పేరుతో కార్మికులను తొలగించాలని చూడడం దుర్మార్గమన్నారు. కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించాలన్నారు. నిలిచి పోయిన టెండర్లను వెంటనే పిలవాలని, కార్మికులను తొలగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం హెచ్‌ఆర్ డీజీఎం ఎస్.కె. ఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జి. శ్రీనివాసావు, ఓ.వి. రావు, సోమరాజు, వంశీకృష్ణ, ఉరుకూటి అప్పారావు, రామిరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థావరాలు C/O బస్‌బేలు

- జాతీయ రహదారిపై భారీ వాహనాల నిలుపుదల
- అగనంపూడి, ఇ.మర్రిపాలెం బస్టాప్‌ల వద్ద లారీల పార్కింగ్‌తో అవస్థలు



లంకెలపాలెం మరిడిమాంబ గుడి దగ్గర ఇలా..



ఇ.మర్రిపాలెం బస్టాప్ సమీపంలోని బస్‌బేలో రెండు వరుసల్లో నిలిపిన భారీ వాహనాలు

అగనంపూడి: జాతీయ రహదారిపై బస్టాప్‌ల కోసం ఏర్పాటు చేసిన బస్‌బేలు నేడు భారీ వాహనాల పార్కింగ్ ప్రదేశాలుగా మారిపోతున్నాయి. కూడళ్ల వద్ద బస్టాప్‌లు ఏర్పాటు చేస్తే వాహనాల రద్దీ ఉంటుందనే ఉద్దేశంతో జాతీయ రహదారుల సంస్థ విస్తరణ సమయంలో బస్టాప్‌లకు కొద్దిపాటి దూరంలో బస్‌బేలు ఏర్పాటు చేసింది. అగనంపూడిలో సాయిబాబా గుడి వద్ద, ఇ.మర్రిపాలెం బస్టాప్, లంకెలపాలెం కూడలికి వంద మీటర్ల దూరంలో మరిడిమాంబ గుడికి ఎదురుగా బస్‌బేలు ఏర్పాటు చేసింది. వాస్తవంగా ఇక్కడ బస్‌లు నిలుపుదల చేయాల్సి ఉండగా, కూడళ్లు, బస్టాప్‌లకు దూరంగా ఉండడంతో కూడళ్లలోనే ఆర్టీసీ బస్టాప్‌లు ఏర్పాటు చేసింది. దీంతో బస్‌బేలు నిరుపయోగంగా మారడంతో భారీ వాహనచోదకులు అడ్డాగా మార్చుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భారీ వాహనాలు తిరిగి వెళ్లే వరకు ఈ కూడళ్లలో వాహనాలను నిలిపేస్తున్నారు. ఈ వాహనాల సిబ్బంది అన్నపానీయాలుతోపాటు స్నానాలు, వంటలు కూడా ఇక్కడే కానిస్తున్నారు. దీంతో వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందిగా మారడంతోపాటు రోడ్డుమీదే కునుకుతీరడం, డిడైవర్‌పై సేదతీరడం చేస్తున్నారు. ఈ కారణంగా కూడళ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్‌బేల్లో వాహనాల మరమ్మతులు కూడా చేస్తుండడంతో గ్యారేజీలుగా మారిపోయాయి. దీంతో ఈ ప్రాంతం అంతా ఆయిల్ మరకలతో నల్లగా మారిపోయింది. సమీపంలో ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఉండడంతో వాహనాలు జాతీయరహదారికి ఇరువైపులా నిలిపివేస్తున్నారు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు ఓవర్‌టేక్ చేయబోతూ బస్‌బేల వద్ద ఉన్న డివైడర్లను ఢీకొడుతున్నాయి.

ఇబ్బందిగా ఉంది



బస్‌బేలను గ్యారేజీలుగా మార్చేయడం వల్ల జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. భారీ వాహనాలను రోజుల కొద్దీ పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. రెండు మూడు వరుసల్లో భారీ వాహనాలు నిలపివేస్తే ఇక్కడ రహదారి కుదించుకుపోయి వాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. మరమ్మతుల కోసం ఇక్కడే వదిలేయడంతో స్థానికులతో పాటు వాహనచోదకులకు అవస్థలు తప్పడంలేదు.

-ఎం.వి.నాగేశ్వరరావు, లంకెలపాలెం

రూ.10 నాణేల చెల్లుబాటుపై అపోహలొద్దు



ఖాతాదారులకు నాణేలు అందజేస్తున్న బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్

సీతంపేట : స్థానిక సీతంపేట ఇండియన్ బ్యాంకు వద్ద రూ.10ల నాణేల చెల్లుబాటుపై ఖాతాదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ మాట్లాడుతూ పది రూపాయల నాణేలు చెల్లవని చాలా రోజులుగా పుకారు ఉందన్నారు. దానిపై ప్రజల్లో, వ్యాపారుల్లో ఉన్న అపోహలు నివృత్తి చేసేందుకే ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్ట ప్రకారం రూపొందించి చెలామణీలోకి తీసుకొచ్చామన్నారు. ఎలాంటి లావాదేవీలకైనా ఈ నాణేలు వాడొచ్చని... అపోహలు, సందేహాలు వీడి పది రూపాయల నాణేలతో నిరభ్యంతరంగా లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు పది రూపాయాల నాణేలు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.